21-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మొత్తం సృష్టి అంతటికీ పాలనకర్త ఒక్క తండ్రియే, వారు ఎప్పుడూ ఎవరి పాలననూ తీసుకోరు, వారు సదా నిరాకారుడు - ఈ విషయాన్ని నిరూపించి అందరికీ అర్థం చేయించండి"

ప్రశ్న:- ఈశ్వరీయ విద్యార్థి యొక్క మొదటి ముఖ్యమైన గుర్తు ఏమిటి?

జవాబు:- ఈశ్వరీయ విద్యార్థి ఎప్పుడూ మురళి వినకుండా ఉండలేరు. వారు - మాకు మురళి వినడానికి తీరికే లభించదు అని అనరు. ఎక్కడ ఉన్నా సరే, పాయింట్లను తెప్పించుకునైనా చదువుకుంటారు. ఎన్ని లెక్కలేనన్ని పాయింట్లు వినిపించబడతాయి! ఒకవేళ మురళి వినకపోతే ధారణ ఎలా జరుగుతుంది? ఇది చదువు, చదివించేవారు సుప్రీమ్ టీచర్ , కావున పిల్లలు ఎప్పుడూ మురళిని మిస్ చేయకూడదు.

పాట:- నిన్ను పొంది మేము... (తుమ్హే పాకె హమ్నే...)

ఓంశాంతి. ఇప్పుడు ఆత్మలైన మీరు తండ్రిని తెలుసుకున్నారు. సూక్ష్మమైన లేక స్థూలమైన శరీరము లభించనివారు ఒక్క శివబాబాయేనని పిల్లలకు తెలుసు. బ్రహ్మా, విష్ణు, శంకరులకు కూడా సూక్ష్మ శరీరాలను చూపిస్తారు. వారికి పేర్లు కూడా ఉన్నాయి. వారిలో ఆత్మ ఉందని, సూక్ష్మ శరీరము ఉందని పిల్లలు అర్థం చేసుకున్నారు. ఈ సమయంలో పిల్లలైన మీరు త్రిలోకీనాథులుగా అవుతారు. లక్ష్మీ-నారాయణులను ఎవరూ త్రిలోకీనాథులు అని అనరు. లక్ష్మీ-నారాయణులకు ఈ మూడు లోకాలు (మూలవతనము, సూక్ష్మవతనము, స్థూలవతనము) గురించి తెలియదు. ప్రతి విషయాన్ని - అది రైటా లేక రాంగా అని బుద్ధి ద్వారా నిర్ణయించాలి. కేవలం ఏది వింటే అది సత్యం, సత్యం అని అనడం - ఇది భక్తి మార్గము. ఇక్కడైతే బాగా అర్థం చేసుకోవాలి. తప్పకుండా బ్రహ్మా, విష్ణు, శంకరులకు సూక్ష్మ శరీరాలు ఉన్నాయి. కేవలం ఒక్క శివుడే నిరాకారుడు. వారి మందిరాలు కూడా అనేక రకాలుగా నిర్మించబడి ఉన్నాయి మరియు వారికి పేర్లు కూడా అనేక రకాలవి పెట్టారు. లింగాలు ఉన్నటువంటి మందిరాలు లెక్కలేనన్ని ఉన్నాయి. బొంబాయిలో మందిరముంది, వారిని బాబూరీనాథ్ అని అంటారు. నిజానికి శివుడు ఒక్కరే, విదేశాల వైపు కూడా ఎన్నో పేర్లు పెట్టారు. ఇప్పుడు పిల్లలకు తెలుసు - మనం ఒక ఆత్మ. పరమపిత పరమాత్మ పిల్లలైన మనకు అర్థం చేయిస్తున్నారు. మూడు లోకాల జ్ఞానాన్ని ఇస్తున్నారు. ఈ సమయంలోనే మీరు త్రిలోకీనాథులుగా ఉన్నారు ఎందుకంటే వాటి గురించి మీకు తెలుసు. ఎప్పటివరకైతే ఎవరైనా తెలుసుకోరో, అప్పటివరకు వారు నాథులుగా ఎలా అవ్వగలరు? కేవలం బ్రహ్మా సంతానమైన బ్రాహ్మణులే త్రిలోకీనాథులు, వారికి మూడు లోకాల జ్ఞానం ఉంది. తండ్రి నాలెడ్జ్ ఫుల్ (జ్ఞాన సంపన్నులు) మరియు బ్లిస్ ఫుల్ (ఆనంద సాగరుడు). ఆ నిరాకార తండ్రి మనకు జ్ఞానాన్ని ఇస్తున్నారు. సాకార మనుష్యులెవ్వరినీ భగవంతుడు అని అనలేరు. ఇక్కడైతే సర్వవ్యాపి అని అనేస్తారు.

గాడ్ ఫాదర్ ఒక్క నిరాకారుడైన శివుడేనని, వారికి పాలన కూడా జరగదని ఇప్పుడు పిల్లలైన మీరు అర్థం చేసుకున్నారు. మిగిలినవారందరికి పాలన జరుగుతుంది. ఆత్మ చిన్న శరీరములోకి వస్తుంది. గర్భములో తన వేలును చప్పరిస్తుంది. శివబాబాకు అలా చప్పరించడానికి వేలే లేదు. శివబాబా అంటారు - నేనైతే గర్భములోకే వెళ్ళను, మిగిలినవారంతా గర్భములోకి వెళ్తారు. ఆ తర్వాత వారి పాలన కూడా జరుగుతుంది. తల్లి భోజనము మొదలైనవి తినేటప్పుడు ఏదైనా పుల్లని వస్తువును తింటే దాని ప్రభావము శిశువుపై పడుతుంది మరియు శిశువుకు హాని కలుగుతుంది. శివబాబా అడుగుతారు - మీరు నా పాలన ఎలా చేయగలరు? నన్ను మొత్తం సృష్టి అంతటి పాలనకర్త అని అంటారు. నా కన్నా పైన ఇంకెవ్వరూ లేరు. ఈ విషయాలను బాగా అర్థం చేసుకోవాలి. విచార సాగర మంథనము చేసి పాయింట్లు తీయాలి. తప్పకుండా శివబాబా తండ్రి అవుతారు. వారిని ప్రియుడు అని కూడా అంటారు. మనుష్యమాత్రులందరూ ఆ ఒక్క ప్రియునికి ప్రేయసులు. మీరందరూ ప్రేయసులు అయినప్పుడు, వారు ప్రియుడు. ప్రియుడు నిరాకారుడు. సాకారులను లేక ఆకారులను ప్రియుడు అని అనలేరు. అందరి ప్రియుడు ఒక్క నిరాకారుడైన బాబాయే. నిరాకార ఆత్మలు తమ ప్రియుడిని తలచుకుంటారు. ఎందుకు తలచుకుంటారు? తప్పకుండా ఏదో ఒక కష్టం ఉండి ఉంటుంది. భక్తులందరూ భగవంతుడిని తలచుకుంటారు. ఈ ప్రేయసీ-ప్రియులు నిరాకారులు. ఆ సాకారీ ప్రేయసీ-ప్రియులు ఎవరైతే ఉంటారో, వారికి కూడా మహిమ ఉంది మరియు వారు చాలా కొద్దిమందే ఉంటారు. ఒకరి శరీరముపై ఒకరు బలిహారమవుతారు. వారికేమీ వికారాల కొరకు ప్రేమ ఉండదు. కేవలం ఒకరినొకరు చూసుకుంటూ ఉంటారు. అలా చూసుకోకపోతే వారికి సుఖము కలగదు. శరీరాన్ని తలచుకుంటారు. ఎక్కడ కూర్చున్నా సరే, తమ

ఎదురుగా ప్రియుడు నిలబడి ఉన్నారు అన్నట్లు భావిస్తారు. వారికి సాక్షాత్కారమవుతుంది ఎందుకంటే అది పవిత్రతతో కూడిన ప్రేమ. శరీరము యొక్క సౌందర్యము కూడా ఉంటుంది కదా. వికారాల కొరకు కాదు, ఒకరినొకరు చూసుకుని సంతోషపడతారు. తింటూ ఉండగా వారి స్మృతి కలిగిందంటే, ఇక అంతే, తినడము మర్చిపోతారు. వారినే చూస్తూ ఉంటారు. అలా కొద్దిమందే ఉంటారు. ఇక్కడైతే అందరికందరూ ప్రియుడైన ఆ శివబాబాకు ప్రేయసులే, కానీ ఎంత కొద్దిమంది పాస్ విత్ హానర్లుగా అయ్యే సత్యమైన ప్రేయసులుగా అవుతారు! ఎనిమిది రత్నాలకు ఎంత మహిమ ఉంది! కావున భక్తులకు భగవంతుడు లభించినప్పుడు, మరి వారిని ఎంతగా స్మృతి చేయాలి! తండ్రి అంటారు - పిల్లలూ, నిరంతరము నన్ను స్మృతి చేయండి ఎందుకంటే నా ద్వారా మీకు ఎంతో సుఖము లభిస్తుంది. అక్కడ మహా అయితే అల్పకాలికమైన సుఖము లభిస్తుంది. పరస్పరం ఎంతో ప్రేమ ఉంటుంది. ఇక్కడ ఇది అనంతమైన తండ్రి పట్ల అనంతమైన ప్రేమ. అనంతమైన ప్రేమ ఒక్కరి పైనే ఉంటుంది. వారికి శారీరిక నామమేమీ లేదని పిల్లలకు తెలుసు.

విష్ణువు యొక్క రెండు రూపాలైన లక్ష్మీ-నారాయణుల వంశము తప్పకుండా ఉంటుంది. సత్యయుగ ఆదిలో లక్ష్మీ-నారాయణుల రాజ్యం ఉన్నప్పుడు తప్పకుండా ప్రజలు కూడా ఉంటారు. సత్యయుగ ఆదిలో ఇంతమంది ఉంటారు, తర్వాత వృద్ధి జరుగుతూ ఉంటుంది అని బుద్ధి కూడా చెప్తుంది. సత్యయుగ ఆదిలో లక్ష్మీ-నారాయణుల రాజ్యం ఉండేది. తప్పకుండా యమునా నదీ తీరముపై రాధే-కృష్ణుల రాజధాని ఉండేది. గంగ-యమున మొదలైన నదులు ఎన్నో ఉన్నాయి. నదీ తీరములో ఉండేవారు. సాగరములో ద్వారక మునిగిపోయింది అన్నట్లు చూపిస్తారు - ఇటువంటి విషయము ఏదీ లేదు. అలాగే సాగర తీరములో దేవతల ఊర్లు ఉండవు. ఈ బొంబాయి ఏమైనా ఉంటుందా. ఇప్పుడు ఇది మీ బుద్ధిలో ఉంది. గాడ్ ఫాదర్ అతి ప్రియమైనవారు, క్రైస్తును గాడ్ ఫాదర్ అని అనరు. క్రైస్తు ఒక సందేశకుడు, పరమపిత పరమాత్మ వారిని పంపించారు అని తెలుసు. అతను నిరాకారీ ప్రపంచము నుండి వస్తారు. అతడిని గాడ్ ఫాదర్ గా భావించరు, మత ప్రవక్తగా భావిస్తారు. హిందూ ధర్మాన్ని ఎప్పుడు మరియు ఎవరు స్థాపించారు? అనేది హిందువులకు తెలియదు. నిజానికి హిందూ ధర్మమేమీ లేదు, అది ఆది సనాతన దేవీ-దేవతా ధర్మము. జనాభా లెక్కల్లో ఒకవేళ మనల్ని అడిగితే, మనం - మేము బ్రాహ్మణులము అని చెప్తాము. ఈ సమయంలో మనమేమైనా హిందువులమా. ఈ సమయంలో మనం బ్రహ్మ ముఖవంశావళి బ్రాహ్మణులము. కానీ మీరు బ్రాహ్మణ ధర్మానికి చెందినవారము అని చెప్పినా సరే, వాళ్ళు హిందువుల లెక్కలోనే వ్రాస్తారు. అక్కడ స్వర్గములో ఈ జనాభా లెక్కలే ఉండవు ఎందుకంటే అక్కడ ఉన్నదే ఒక్క దేవీ-దేవతా ధర్మము. అందుకే అడగవలసిన అవసరమే లేదు. ఇక్కడ ఎన్నో ధర్మాలు ఉన్నాయి, అందుకే అడుగుతారు. ఈ విషయాలన్నింటినీ తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. కావున బుద్ధి ద్వారా తండ్రిని స్మృతి చేయాలి. వారు నిరాకారుడు మరియు వారి పేరు ఒక్కటే. బ్రహ్మ, విష్ణు, శంకరులవి కూడా ఆకారీ చిత్రాలు కనిపిస్తాయి. శివునిది ఎక్కడ ఉంది? వీరు భగవంతుడు అని కూడా భావిస్తారు. మనం స్వయాన్ని భగవంతునిగా చెప్పుకోలేము. ఆత్మలైతే పునర్జన్మలు తీసుకుంటారు. తండ్రి కూడా పునర్జన్మలు తీసుకుంటారని కాదు.

ఇప్పుడు మీకు మూడు లోకాల గురించి తెలుసు, అందుకే త్రిలోకీనాథ్ అన్న పేరు ఉంది. తెలుసుకున్నవారే నాథులుగా అవుతారు. మీకు ఇప్పుడు త్రిలోకాల జ్ఞానం ఉంది. ఇది బ్రాహ్మణులైన మీకే తెలుసు, ఇంకెవ్వరూ తెలుసుకోలేరు. సత్యయుగములో ఈ జ్ఞానమే ఉండదు. ఇది కేవలం మీకే లభిస్తుంది, అందుకే మీ పేరు ప్రసిద్ధమైనది. దిల్వాడా మందిరంలో శివుడు, ఆదిదేవ్, ఆదిదేవి మరియు పిల్లలైన మీరు ఉన్నారు ఎందుకంటే మీరు ఇప్పుడు సేవ చేస్తారు. తండ్రి పతితులను పావనంగా తయారుచేయడానికి వస్తారు కావున పిల్లలైన మీ సహాయాన్ని తీసుకుంటారు. తండ్రి అంటారు, ఎవరెవరు నా సహాయకులుగా అవుతారో, వారి గురించి నాకు తెలుసు. ఇది ఎవరైనా అర్థం చేసుకోగలరు, దీనికి రిటర్న్ లో మిమ్మల్ని స్వర్గాధిపతులుగా తయారుచేస్తారు. విద్యార్థులందరూ ఒకే విధముగా ఉండరు. శివబాబా దుకాణము - మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేసేది, మళ్ళీ అందులో నంబరువారుగా ఉన్నారు. మహారథుల సెంటర్ తప్పకుండా బాగా నడుస్తూ ఉండవచ్చు. వీరు మంచి సేల్స్ మెన్ అని భావిస్తారు. అన్నీ శివబాబా దుకాణాలే. మీరు అవినాశీ జ్ఞాన రత్నాల వ్యాపారము చేస్తారు. ఈ తండ్రి ఎంత సాధారణమైనవారు! సత్యానికి మరియు అసత్యానికి ఎంత తేడా ఉంది! సత్యాన్ని తెలియజేసేవారు ఒక్క తండ్రే. మిగిలినదంతా అసత్యమే-అసత్యము. అన్నింటికన్నా అతి పెద్ద అసత్యమేమిటంటే - శ్రీమతాన్ని ఇచ్చే పరమపిత పరమాత్మను సర్వవ్యాపి అని అంటారు! ఇంతకుముందైతే అనంతము అని అనేవారు. రావణుడు ఎవరు, ఎప్పటి నుండి వచ్చాడు - ఇది కూడా ఎవ్వరికీ తెలియదు. రావణుడిని వాళ్ళు త్రేతాలోకి తీసుకువెళ్ళారు. శ్రీకృష్ణుడిని ద్వాపరములోకి తీసుకువెళ్ళారు. సత్యయుగమును గురించి తెలియనే తెలియదు. సీతా-రాములు త్రేతాలో ఉండేవారు. అక్కడ రావణుడి ప్రస్తావనే రాదు.

అన్నీ ఇక్కడి విషయాలే. అది ఒక ప్రగల్బము మాత్రమే. ఎవరికైనా అర్థం చేయిస్తే, ఇదంతా బి.కే.ల ఊహ అని అంటారు. ఇప్పుడు పిల్లలకు అర్థం చేయించడం జరిగింది. పాయింట్లు వెలువడుతూ ఉంటాయి, వాటిని ధారణ చేయాలి. ఎక్కడ ఉన్నా సరే, పాయింట్లను తెప్పించుకొని చదువుకోవాలి. ఖాళీ సమయము లేదు అన్నట్లు ఉండకూడదు. అరే, ఒకవేళ ఈశ్వరీయ విద్యార్థి - మాకు ఖాళీ సమయం లేదు అని అంటే, వారిని ఏమంటారు? వారు ఇతరుల చేత ధారణ ఎలా చేయించగలరు? ఇన్ని లెక్కలేనన్ని పాయింట్లు వినిపించబడతాయి, మరి వారు మురళి వినకపోతే లేక చదవకపోతే ధారణ ఎలా జరగగలదు. ఇది విద్య. చదివించే సుప్రీమ్ టీచర్ ఒక్కరే. ఒకవేళ మురళిని వినకపోతే పాయింట్లను ఎలా వినిపించగలరు?

తండ్రి జనన-మరణ రహితుడని పిల్లలు అర్థం చేసుకుంటారు. వారు పునర్జన్మలు తీసుకోరు. కానీ వారి జయంతిని జరుపుకుంటారు. వారు శివజయంతిని జరుపుకోవడం కూడా మానేస్తూ ఉన్నారు. ఇప్పుడు శివుని జన్మ ఎలా జరిగింది, వారు ఏమి చేసి ఉంటారు అనేది ఎవరు తెలియజేయగలరు? గీతలో శ్రీకృష్ణుని పేరును వేసారు కానీ వారు అదే రూపముతో రాలేరు. శ్రీకృష్ణుడిని వైకుంఠనాథుడు అని అంటారు, త్రిలోకీనాథుడు అని అనరు. వైకుంఠము లేక స్వర్గము ఇక్కడే ఉండేది. శ్రీకృష్ణుడు కూడా ఇక్కడే ఉండేవారు. రాధే-కృష్ణులేమీ సోదరీ సోదరులు కారు. ఇరువురూ వేరు-వేరుగా తమ తమ రాజధానిలో ఉండేవారు. స్వయంవరం ఎలా జరుగుతుంది? అనేది పిల్లలు సాక్షాత్కారములో చూసారు. బాబా ప్రారంభంలో మిమ్మల్ని ఎంతో ఆహ్లాదపరిచారు. ఒంటరిగా లోపల భట్టీలో ఉండేవారు. మిత్ర-సంబంధీకులు మొదలైనవారెవరినీ కలుసుకునేవారు కారు. కావున బాబా ఎంతో చూపించారు. మళ్ళీ చివరిలో మీరు ఎంతో చూస్తారు. మేము వైకుంఠములో కూర్చొని ఉన్నాము అన్నట్లు భావిస్తారు. అంతిమ సమయంలో మనుష్యులు హైరానా పడతారు. ఎన్నో ఆపదలు రానున్నాయి, దీనిని అతి రక్తసిక్తమైన ఆట అని అంటారు. దీని గురించి ప్రపంచానికి తెలియదు. ఆ గవర్నమెంటు ఏదైనా డైరెక్షన్లు తీసుకుంటుందని కూడా కాదు. ఇప్పుడు అందరి వినాశనము జరగనున్నది. మీరు అవినాశీ తండ్రి నుండి అవినాశీ పదవిని పొందుతున్నారు. ప్రజలలోకి వచ్చినా అహో సౌభాగ్యమే. అక్కడ సుఖమే సుఖము ఉంటుంది. ఇక్కడ దుఃఖమే దుఃఖము ఉంది. ఇప్పుడు తండ్రి చదివించడానికి వచ్చారు కావున చదువుకోవాలి కూడా కదా. పని ఉన్నా సరే, చేతులు పని వైపు, హృదయము ప్రియుని వైపు... బుద్ధియోగము తండ్రితో జోడించబడి ఉండాలి. గృహస్థ వ్యవహారములో ఉంటూ స్మృతి వారినే చేయాలి. అరే, తండ్రి స్వర్గాధిపతులుగా తయారుచేస్తున్నారు, మీరు ఏమనుకుంటున్నారు! 21 జన్మలు రాజ్యం చేస్తారు. చింతించే విషయమేదీ లేదు. ఇక్కడ చూడండి, మనుష్యులకు ఎంత చింత ఉంటుంది! అక్కడ చింత ఉండదు. మీరు అక్కడ ప్రారబ్ధాన్ని అనుభవిస్తారు. కానీ అక్కడ ఇది కూడా తెలియదు. మనము అవినాశీ తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటున్నాము అన్న జ్ఞానం మీకు ఇప్పుడు ఉంది. తర్వాత ఆటోమేటిక్ గా మనము రాజధాని వారసత్వాన్ని తీసుకుంటూ ఉంటాము. దాన-పుణ్యాలు చేయడం వల్ల రాజులుగా అవుతారని కాదు. అలా కాదు. ఈ సమయం యొక్క పురుషార్థానికి అది ప్రారబ్ధము. కావున ఎంత పురుషార్థము చేయాలి. దీని ద్వారా 21 జన్మల ప్రారబ్ధము తయారవుతుంది. అక్కడ పురుషార్థము, ప్రారబ్ధము అనే విషయాలు ఉండవు. అసలు అక్కడ పురుషార్థము చేయవలసి వచ్చేలా అప్రాప్తి అన్న వస్తువే ఉండదు. అందరూ ధనవంతులే. ఇక్కడ మనుష్యులు - మేము జడ్జీ అవ్వాలి, డాక్టరు అవ్వాలి... అని చదువుతూ ఉంటారు. అక్కడ జడ్జీలూ ఉండరు, డాక్టర్లూ మొదలైనవారు ఉండరు. అక్కడ ఎవరూ పాపము చేయనే చేయరు. అక్కడ దొంగలు మొదలైవవారెవరూ ఉండనే ఉండరు. మీరు మొత్తం విశ్వానికి అధిపతులుగా అవుతారు. ఏ విషయము యొక్క చింతా ఉండదు. భోజనము మొదలైనవాటిని ధనముతో కొనవలసిన అవసరం ఉండదు. ఇక్కడ కూడా బాబా సమయంలో 8-10 అణాలకు ఒక మణుగు ధాన్యము లభించేది. మరి దాని కన్నా ముందు ఇంకెలా ఉండి ఉంటుంది? ఇప్పుడు ధరలు ఎంత ఎక్కువగా ఉన్నాయి! ఇప్పుడు ఈ ధరలు ఇంకా పెరుగుతాయి, ఆ తర్వాత చౌకగా అయిపోతుంది. డ్రామానుసారంగా మీకు అన్నీ లభిస్తాయి. వారి సహాయముతో మీకు రాజధాని లభించనున్నది. రెండు కోతులు పోట్లాడుకుంటాయి, వెన్న మీకు లభిస్తుంది. మిమ్మల్ని చదివించేవారు ఎవరు అనేది ప్రపంచానికి ఏమైనా తెలుసా! వీరు ఉండడం కూడా గుప్త వేషములో ఉన్నారు. మీకు ఒక్క క్షణములో వైకుంఠ రాజధానిని ఇచ్చేస్తారు. ఖుదా దోస్త్ కథ ఉంది కదా. ఈ మహిమ తండ్రిదే. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మంచి చురుకైన సేల్స్ మాన్ గా అయి అవినాశీ జ్ఞాన రత్నాల వ్యాపారాన్ని చేయాలి. అవినాశీ ప్రారబ్ధాన్ని తయారుచేసుకునేందుకు మీ బుద్ధి యోగాన్ని ఒక్క తండ్రితో జోడించాలి.

2. పాస్ విత్ హానర్ గా అయ్యేందుకు సత్యాతి-సత్యమైన ప్రేయసిగా అవ్వాలి. నిరంతరం ఒక్క ప్రియుని స్మృతిలో ఉండాలి.

వరదానము:- సర్వశక్తివంతుని సహచరునిగా అయి సర్వుల పట్ల శుభ భావనను ఉంచే చింతన మరియు చింతా ముక్త భవ

ఫలానావారి వ్యాధి నయమవ్వాలి, పతి లేక పిల్లలు జ్ఞానంలో నడవాలి, వ్యాపారం బాగుపడాలి... అని చాలామంది పిల్లలు చింతన చేస్తారు. ఈ భావన అయితే మంచిదే, కానీ ఎప్పుడైతే స్వయం తేలికగా అయి తండ్రి నుండి శక్తిని తీసుకుంటారో, అప్పుడే మీ ఈ కోరికలు పూర్తవుతాయి. దీని కొరకు బుద్ధి రూపీ పాత్ర ఖాళీగా ఉండాలి. అందరి కళ్యాణము కోరుకుంటున్నట్లయితే స్వయం శక్తిరూపులుగా అయి, సర్వశక్తివంతుని సహచరులుగా అయి, శుభ భావనను ఉంచి ముందుకు వెళ్తూ ఉండండి. చింతన మరియు చింతా ముక్తులుగా అవ్వండి, బంధనములో చిక్కుకోకండి.

స్లోగన్:- ఎవరైతే ప్రశ్నల నుండి అతీతంగా ఉంటారో, వారే సదా ప్రసన్నచిత్తులుగా ఉంటారు.